సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



ముమ్మరంగా తునికాకు సేకరణ
తునికాకు సేకరణ ముమ్మరంగా సాగుతోంది. గిరిజన కూలీలు తెల్లవారుజామునే అడవులకు వెళ్లి ఆకు సేకరిస్తున్నారు. 8లో




మళ్లీ చుక్కెదురు..
ప్రభుత్వం రెండు కొత్త మండలాలను ప్రకటించగా.. కొమురారం, బోడు గ్రామాలకు అందులో స్థానం దక్కలేదు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
42° / 25°
జిల్లాలో గురువారం ఎండల ప్రభావం అధికంగా ఉంటుంది. వడగాలులు కూడా వీచే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురువారం సా॥) 6.31
సహర్ (శుక్రవారం ఉ॥) 4.26

సరిహద్దుల్లో దందా!

అనుమతి కొంత.. ఆడేది మరింత..
- మాయమాటలతో బురిడీ కొట్టిస్తున్న నిర్వాహకులు
- తాత్కాలిక షెడ్లలోనే పేకాట, కోడి పందేలు
- నష్టపోయిన వారు తేరుకునే లోపే మటుమాయం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కోడి పందేలు, పేకాట పేరుతో సరదా రాయుళ్ల సంపాదన, ఆస్తులను హరించి వేస్తున్న ముఠా ప్రత్యేక పద్ధతుల్లో తమ వ్యూహాలను అమలు చేస్తోంది. ఈ ముఠా చేసే మోసం అర్థమయ్యేలోపు వీళ్లను నమ్ముకున్న వాళ్లు నట్టేట మునుగుతున్నారు. తెలంగాణలో పేకాట క్లబ్‌లపై 2014లో నిషేధం విధించారు. అప్పటి నుంచి కొన్ని ముఠాలు చాటుమాటుగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నాయి. అయితే రెండు మూడేళ్లుగా ఈ ముఠాలు రూట్ మార్చాయి. రాష్ట్రంలో నిర్బంధం మధ్య పేకాట కేంద్రాలు నిర్వహించాల్సి వస్తుండడంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాయి. చివరకు రాష్ట్రంలోని గోదావరి తీరం వెంట ఇతర రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకుంటున్న జిల్లాలను ఎంపిక చేసుకున్నాయి. రాష్ట్ర సరిహద్దును ఆనుకుని లేదా 10 – 15 కిలోమీటర్ల దూరంలో గల పొరుగు రాష్ట్రంలో పేకాట స్థావరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రం పొరుగు రాష్ట్రంలో ఉందన్న పేరే కానీ.. అక్కడ ఆడేవారు, ఆడించేవారూ తెలంగాణ వారే.

నిబంధనలకు విరుద్ధంగా..
పొరుగు రాష్ట్రాల్లో పేకాట కోసం అనుమతి తీసుకున్న టేబుళ్లకు అదనంగా నాలుగైదు రెట్లు టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. పేకాటకు నిర్దేశించిన సమయ నిబంధనలు తుంగలో తొక్కి రాత్రీ పగలు తేడా లేకుండా నిర్వహిస్తూనే ఉంటారు. ఇక భద్రాద్రి జిల్లాకు ఏపీతో కూడా సుదీర్ఘ సరిహద్దు ఉండటంతో జిల్లాకు సమీపంలో ఏర్పాటు చేసిన క్లబ్బుల్లో అదనంగా కోడి పందేలను సైతం నిర్వహిస్తున్నారు. సమయపాలన లేకుండా 24 గంటలూ ఆటలు సాగడంతో కొందరు భారీగా లాభపడితే, చాలామంది తీవ్రంగా నష్టపోతున్నారు. అక్కడికక్కడే ఒంటిపై ఉన్న ఆభరణాలు, సెల్‌ఫోన్లు తాకట్టు పెట్టి మరీ ఆడుతుంటారు. దీంతో ఒక రోజులో తీవ్రంగా నష్టపోయిన వారు మరునటి రోజు గొడవ చేసే ఆస్కారం లేకుండా చూసుకుంటారు. అందుకే ప్రతీ రోజు కాకుండా వారంలో మూడు రోజులే ఆట నిర్వహిస్తారు. ఇబ్బందులు రాకుండా పరిచయస్తుల ద్వారా నమ్మకమైన వారికే క్లబ్బుల్లో ప్రవేశం కల్పిస్తారు.

తాత్కాలిక గుడారాల్లోనే నిర్వహణ..
ఆటలు, పందేల్లో నష్టపోయిన వ్యక్తులు లేదా నిబంధనల ఉల్లంఘన అంటూ ప్రభుత్వ సిబ్బంది ఎవరైనా ఇక్కడి దందాను ప్రశ్నిస్తే ముందుగా మాటలతో సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తారు. కాదంటే మామూళ్ల పేర తప్పించుకునే ఎత్తుగడ వేస్తారు. అదిగో ఇదిగో అంటూ నెల, రెండు నెలల పాటు వాయిదా వేస్తూ పబ్బం గడుపుకుంటారు. ఇక ఈ శిబిరం కారణంగా నష్టపోయిన వారి నుంచి దుష్ప్రచారం మొదలైనా, ప్రభుత్వ సిబ్బంది నుంచి ఒత్తిడి పెరిగినా రాత్రికి రాత్రే టికాణా ఎత్తేస్తారు. అందుకు తగ్గట్టుగా పేకాట/కోడి పందేల కోసం అనుమతులు తెచ్చుకుంటున్న వారు ఎక్కడా పర్మనెంట్ సెటప్ ఏర్పాటుచేయరు. టెంట్లు, గుడారాలు, ఫ్యాన్లు, కూలర్లతోనే నడిపిస్తారు. అప్పటి వరకు కళకళలాడిన పేకాట శిబిరం ఒక్కరోజులో మాయమైపోవడంతో నిర్వాహకుల మాటలు నమ్మినవారు హతాశువులవడం పరిపాటిగా మారింది.

ఇవీ ఉదాహరణలు..
గోదావరి తీరం వెంబడి పేకాట, కోడి పందేల నిర్వాహకులు అంతా ఒక జట్టుగా మారారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మొదలు భద్రాద్రి జిల్లా వరకు స్థానిక అవసరాలను బట్టి కొత్త వ్యక్తులు ఈ టీమ్‌లోకి వస్తూ పోతుంటారు. గతంలో ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దులో ఉన్న చంద్రాపూర్(మహారాష్ట్ర) జిల్లా రాజూరీలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దులో గడ్చిరోలి(మహారాష్ట్ర) జిల్లా అంకీస దగ్గరలో ఈ తరహా శిబిరాలు నిర్వహించారు. ఆ తర్వాత అక్కడ వీరిపై ఆగ్రహం వ్యక్తం కావడంతో పెట్టేబేడా సర్దుకున్నారు.

వీరే కీలకం..
ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా మారాయిగూడ కేంద్రంగా కోడి పందేల కేంద్రాన్ని నిర్వహించారు. సంక్రాంతి పండుగ సమయంలో నిర్వహించిన ఈ పందేలతో ఖజానా నిండడంతో ఆ తర్వాత పత్తాలాట ప్రవేశపెట్టారు. సంక్రాంతితో పాటు దసరా, ఉగాది, వేసవి ఇలా సీజన్ల వారీగా పేకాట, కోడి పందేల శిబిరాలు నిర్వహిస్తున్నారు. మారాయిగూడ పేకాట కేంద్రానికి సంబంధించి భద్రాచలం, సారపాక పట్టణాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

జిల్లా జడ్జిగా వసంత్ పాటిల్

మహబూబాబాద్ ప్రధాన న్యాయమూర్తిగా చంద్రశేఖర ప్రసాద్



వసంత్ పాటిల్

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా మహబూబాబాద్ జడ్జి వసంత్ పాటిల్ రానున్నారు. ప్రస్తుత జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్‌ను మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో వసంత్ పాటిల్ ఇక్కడికి రానున్నారు. ఏడాది క్రితం జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర ప్రసాద్ కోర్టు ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా మార్చారు. భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు న్యాయస్థానాల భవన సముదాయాలను కూడా తీర్చిదిద్దారు. జిల్లాలో అనేక సంచలనాత్మకమైన కేసుల్లో తీర్పు చెప్పి, కొందరికి జీవిత ఖైదు శిక్ష విధించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్‌గా లోక్ అదాలత్‌లు నిర్వహించి వేల సంఖ్యలో కేసులు పరిష్కరించారు.

ఎండలతో తస్మాత్ జాగ్రత్త

ప్రజలకు కలెక్టర్ అనుదీప్ సూచన



కొత్తగూడెంఅర్బన్: ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వడదెబ్బ తగిలితే తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, చర్మం పొడిబారడం, వాంతులు, కలవరింతలు తదితర లక్షణాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆరుబయట పనిచేసేవారు సూర్యరశ్మి నుంచి కాపాడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ నీరు తాగడంతో పాటు బయటకు వెళ్లినప్పుడు వెంట తీసుకెళ్లాలని సూచించారు. వీలైనంత ఎక్కువగా నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తాగాలని, కాటన్, తెలుపు, లేత రంగుల వస్త్రాలు ధరించాలని తెలిపారు. మజ్జిగ, గ్లూకోస్ నీరు, ఉప్పు, పంచదార కలిపిన ద్రావణం తాగితే మంచిదని, ఓఆర్ఎస్ ద్వారా కూడా వడదెబ్బ నుంచి ఉపశమనం పొందవచ్చని వివరించారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండకు బయటకు వెళ్లవద్దని సూచించారు. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు టీ, కాఫీ వంటివి తాగవద్దని తెలిపారు. వడదెబ్బకు గురైతే సమీపంలోని పీహెచ్‌సీ, లేదా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు.

రామాలయ రికార్డుల తనిఖీ



రామాలయంలో జ్యోతి, రమాదేవి తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని కార్యనిర్వాహక రికార్డులను దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి బుధవారం తనిఖీ చేశారు. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలను తనిఖీ చేయాలని ఉన్నత స్థాయి అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆయా ఆలయాల్లో రికార్డులను తనిఖీ చేయడంతో పాటు సిబ్బంది పనితీరును, మెరుగుపర్చాల్సిన అంశాలను పరిశీలించి కమిషనర్‌కు నివేదిక అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో తనిఖీల బాధ్యతను జ్యోతికి అప్పగించగా ఆమె బుధవారం భద్రాచలం వచ్చి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం స్వామివారి మూలమూర్తులను దర్శించుకుని అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా బేడా మండపంలో స్వామివారికి స్నపన తిరుమంజనం చేశారు.

సింగరేణిలో 18 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 18 మంది అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఎనిమిది మంది డీవైజీఎం హోదా అధికారులు ఉండగా, సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్, కాలరీ మేనేజర్, అడిషనల్ మేనేజర్ స్థాయి అధికారులు ఉన్నారు. బదిలీ అయిన అధికారులు ఈనెల 25 లోపు నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని యజమాన్యం ఆదేశించింది.

వీఓఏలపై చిన్నచూపు బాధాకరం



వీఓఏలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల నిర్మాణం మొదలు నేటి వరకు సేవలందిస్తున్న వీఓఏల వేతనాల పెంపు విషయంలో ప్రభుత్వం చిన్న చూపు చూడటం బాధాకరమని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. ఇల్లెందులోని సెర్ప్ కార్యాలయం ఎదుట వీఓఏలు నిర్వహిస్తున్న నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వీఓఏలు ఎదుర్కొంటున్న సమస్యలను, సమ్మెకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఓఏల డిమాండ్లు న్యాయసమ్మతమైనవేనని, వాటిని సత్వరం పరిష్కరించాలని కోరుతూ తాను కూడా ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మండల రాముమహేశ్, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, నాయకులు సాంబమూర్తి, తాటి భిక్షం, ఆముదాల ప్రసాద్, రావూరి సతీశ్, రాజు, శేఖర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించేవరకూ పోరాడుతాం

ప్రజాపోరు యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సుజాతనగర్‌లో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన సాబీర్‌పాషా తదితరులు

సుజాతనగర్/జూలూరుపాడు : దేశంలోని అన్ని వర్గాల ప్రజలను దోచుకుని కార్పొరేట్లకు మాత్రమే లాభం చేకూరుస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకూ తమ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర బుధవారం సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ అవినీతి పాలనకు వ్యతిరేకంగా వామపక్ష, లౌకిక శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలతో కలిసి పని చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. డబ్బు రాజకీయాలతో మభ్యపెట్టే వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో గెలిపించే, ఓడించే సత్తా సీపీఐకి ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, భూక్యా దస్రు, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్, యార్లగడ్డ భాస్కర్‌రావు, జక్కుల రాములు, రత్నకుమారి, వీర్ల మల్లేష్, హనుమంతరావు, వేల్పుల భాస్కర్, పాదిల శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, స్వరాజ్‌రావు, చాంద్ పాషా, పగడాల అఖిల్, యల్లంకి మధు, గార్లపాటి వీరభద్రం, గుడిమెట్ల సీతయ్య, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, తూము కోటయ్య పాల్గొన్నారు.

అధిక ధరలతో పేదల ఇక్కట్లు
అన్నపురెడ్డిపల్లి/అశ్వారావుపేటరూరల్/చంద్రుగొండ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతాల పేరుతో మారణహోమం సృష్టిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఆరోపించారు. పార్టీ చేపట్టిన ప్రజాపోరు యాత్ర బుధవారం అశ్వారావుపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే సీపీఐ లక్ష్యమని అన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందని ద్రాక్షగా మారాయని, పేదలకు 110 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలు మావేనని అధికార పార్టీ నాయకులు అంటున్నారని, కమ్యూనిస్టుల సత్తా కూడా చాటుతామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఎస్‌కే రఫీ, రామకృష్ణ, తిర్నాటి సత్యనారాయణ, దస్తగిరి, గార్లపాటి రామనాథం, బొర్ర కేశవులు, శ్రీను, తాటి వెంకటేశ్వర్లు, ముత్యాల విశ్వనాథం, నారాయణ పాల్గొన్నారు. చంద్రుగొండలో సీపీఎం నాయకుడు రాంరెడ్డి తదితరులు సంఘీభావం ప్రకటించారు.

రావణ కాష్టంలా డంపింగ్ యార్డ్

- భద్రాద్రిని ఏళ్లుగా పట్టిపీడిస్తున్న చెత్త సమస్య
- పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజానీకం
- స్పందించని జిల్లా యంత్రాంగం





కరకట్టపై చెత్త డంప్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది (ఇన్‌సెట్) రాత్రివేళ ఎగిసిపడుతున్న మంటలు

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల దివ్యక్షేత్రంలో నిత్యం రావణకాష్టంలా మంటలు చెలరేగుతున్నాయి. పవిత్ర గోదావరి పక్కనే కరకట్టపై ఉన్న డంపింగ్ యార్డులో చెత్తా చెదారానికి పెట్టిన అగ్నిజ్వాలలు, వాటి నుంచి వెలువడే పొగతో పట్టణ వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ పొగ నుంచి కాపాడి డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నా జిల్లా ఉన్నతాధికారులు స్పందించడం లేదని గగ్గోలు పెడుతున్నారు. రాత్రి వేళల్లో డంపింగ్ యార్డులో కనిపించే మంటలు రావణకాష్టాన్ని తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీకటిపడితే ఎర్రటి జ్వాలలు..
చీకటి పడిందంటే చాలు.. ఎగిసిపడే జ్వాలలు, ఊరిని ముంచేస్తున్న పొగతో స్థానికులు సతమతమవుతున్నారు. ప్రధానంగా సుభాష్‌నగర్, డిగ్రీ కళాశాల, చప్టా దిగువ, అంబసత్రం, రామాలయం చుట్టుపక్కల ప్రాంత కాలనీలు పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఎటు చూసినా కమ్మేసిన పొగలే దర్శనమిస్తూ ప్రజలను, రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దీంతో పవిత్ర పుణ్యక్షేత్రంలో ఈ దృశ్యాలేంటంటూ పలువురు ఆశ్చర్యపోతున్నారు. ఎగిసిపడే మంటలు గాలికి ఇళ్లపై పడి ఆస్తి, ప్రాణ నష్టం కలిగిస్తాయేమోనని కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు దిగువ కాలనీవాసులు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు.

స్థలాలు మారినా.. తీరని సమస్య
తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పడిన డంపింగ్ యార్డు సమస్యకు ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం లభించడం లేదు. మండలంలో భద్రాచలం గ్రామ పంచాయతీ ఒకటే ఉండడంతో స్థలం కొరత ఉందనే కారణంతో పవిత్ర గోదావరి చెంతనే, జనావాసాల నడుమ ఉన్న కరకట్టపై డంపింగ్ యార్డు ఏర్పాటుచేశారు. దీంతో పవిత్రమైన ఈ స్థలం అపవిత్రంగా మారిందని భక్తులు, వ్యర్థాలతో దుర్వాసన, మంటలతో వస్తున్న పొగతో ఇక్కడ ఉండలేకపోతున్నామని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ నేతృత్వంలో పలుచోట్ల పరిశీలించారు. కూనవరం రోడ్డులో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినా అది గోదావరి వరద ముంపునకు గురవుతుందని ఆపేశారు. ఐటీడీఏ రోడ్‌లోని సుందరయ్యనగర్‌లో ఆరెకరాల స్థలాన్ని గుర్తించి తడి, పొడి చెత్తను వేరు చేసేలా పనులు చేపట్టగా ఆ స్థలం పక్కనున్న ఆదర్శనగర్, సుందరయ్య నగర్ తదితర కాలనీల వాసులు అభ్యంతరం తెలపడంతో అక్కడా నిలిపేశారు.

స్పందించని అధికారులు..
డంపింగ్ యార్డు సమస్య భద్రాద్రి వాసులను పట్టి పీడిస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుందరయ్య నగర్‌లో డంపింగ్ యార్డు పనులు ఆగిపోయి ఏడాది దాటినా ఇప్పటికీ ప్రత్యామ్నాయ స్థలం గుర్తించలేదని స్థానికులు అంటున్నారు. ప్రజా సమస్యలను తనదైన శైలిలో పరిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్ భద్రాచలంలో డంపింగ్ యార్డు సమస్యపై కూడా ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం
భద్రాచలంలో డంపింగ్ యార్డు సమస్య ఉన్న మాట వాస్తవమే. కరకట్టపై ఉన్న డంపింగ్ యార్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయి. పలు చోట్ల డంపింగ్ యార్డు నిర్మాణ ప్రతిపాదనలకు స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం.
– పవన్‌కుమార్, డీఎల్‌పీఓ

పంటకు పరిహారం

- గత నెలలో అకాల వర్షాలతో నష్టం
- ఉమ్మడి జిల్లా రైతులకు రూ.25.06 కోట్లు మంజూరు
- 90 రోజుల్లో ఖాతాల్లో జమ



మాణిక్యారంలో దెబ్బతిన్న మొక్కజొన్న(ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్రప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతనెల 17 నుంచి 21 వరకు ఈదురుగాలులు, వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో 18,258 మంది రైతులకు చెందిన 23,632.17 ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 1,978 మంది రైతులకు చెందిన 1,435 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు రూ.25.06 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రధానంగా మొక్కజొన్న..
గతనెల 17 నుంచి 21వ తేదీ వరకు అకాల వర్షాలు కురిశాయి. దీంతో యాసంగిలో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రధానంగా మొక్కజొన్న పంట దెబ్బతినగా, అక్కడక్కడ పెసర, ఇతర పంటలకు కూడా నష్టం వాటిల్లింది. దీంతో గతనెల 23వ తేదీన ఖమ్మం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు.

33శాతం దెబ్బతింటేనే..
వర్షాలతో పంట నష్టం జరగగా అధికారులు సర్వే చేసి నివేదికలు రూపొందిస్తుండగా సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించి పరిహారం ప్రకటించారు. దీంతో ప్రభుత్వ నిబంధనల మేరకు 33 శాతం పంట నష్టపోయిన వారిని గుర్తించి వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పరిహారం నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం జిల్లాలో 18,258 మంది రైతులకు చెందిన 23,632.17 ఎకరాల్లో పంటలకు రూ.23,63,24,250, భద్రాద్రి జిల్లాలో 1,978 మంది రైతులకు చెందిన 1,435 ఎకరాల్లో పంటలకు రూ.1.43,52,500 పరిహారం విడుదలైంది. ఈ పరిహారాన్ని 90 రోజుల వ్యవధిలో బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

- 780 మంది నిరుద్యోగుల హాజరు
- 489 మందికి నియామక పత్రాలు అందజేత



ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న ఉపాధి కల్పనాధికారి విజేత

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐలో ఎల్‌అండ్‌టీ కంపెనీ వారు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. 780 మంది నిరుద్యోగులు హాజరుకాగా, వారిలో 489 మందిని ఎంపిక చేసి నియామకపత్రాలు అందజేసినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, సివిల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులను టెక్నీషియన్లుగా, మహిళలను కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమించామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి చెన్నైలో మూడునెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతితో పాటు రూ.17 వేల వేతనం చెల్లిస్తారని తెలిపారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత వరంగల్, విజయవాడ వంటి నగరాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు.

క్లుప్తంగా

22న పరుగుపందెం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్, సత్తుపల్లి ప్రాంతాల్లోని 34 ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు ఈ నెల 22న ఉదయం 7 గంటలకు పరుగుపందెం ఉంటుందని శ్రీసాయిరామ్ సెక్యూరిటీ సర్వీసెస్ బ్రాంచ్ మేనేజర్ పి.రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల భర్తీ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను ఏరియా సెక్యూరిటీ కార్యాలయంలోని ప్రైవేట్ సెక్యూరిటీ వింగ్‌లో ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు 25 ఏళ్ల నుంచి 44 ఏళ్ల వయసు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, కనీస ఎత్తు 5.5 ఉండాలని పేర్కొన్నారు.

రాత్రికి రాత్రే సమ్మక్క, సారలమ్మ గద్దెల ఏర్పాటు

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలో క్రైస్తవుల చర్చి ప్రాంగణం ఎదుట గత రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సమ్మక్క, సారలమ్మల గద్దెలను ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. చర్చి నిర్మాణం జరుగుతుంటే కొంత మంది చర్చి ఎదుట సమ్మక్క, సారలమ్మ గద్దెలను ఏర్పాటు చేశారని చర్చి నిర్వాహకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. భూమి విషయమై రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న తర్వాత విచారణ చేపడతామని తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

- ఇద్దరికి గాయాలు


గాయపడిన సతీశ్

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాక గ్రామంలో మొండికుంట – సారపాక రహదారిపై బుధవారం మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మణుగూరుకు చెందిన వరపల్లి సతీశ్ బైక్‌పై భద్రాచలం వెళ్తున్నాడు. అశ్వాపురం మండలం చింతిర్యాల గ్రామానికి చెందిన వల్లెపోగు రాజేశ్ సారపాక నుంచి చింతిర్యాల వస్తున్నాడు. నెల్లిపాక గ్రామంలో జిన్నింగు మిల్లు సమీపంలోని మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో సతీశ్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా, రాజేశ్‌కు గాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరిని స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

పాల్వంచరూరల్: జామాయిల్ తోట లో కుళ్లిపోయిన స్థితి లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. ఎస్ఐ శ్రీనివాస్ కథ నం ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామ సమీపంలోని తోగ్గూడెం రోడ్డులో గుర్తు తెలియని 40–50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సర్పంచ్ బానోతు అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు బూడిద రంగు కలిగిన నిక్కరు, తెలుపు, నీలం, నలుపు రంగు గీతలు కలిగిన టీషర్ట్ ధరించి.. ఐదు అడుగుల పొడువు ఉన్నాడని ఎస్ఐ వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో రఘునాథపాలెం మండలం దోనబండకు చెందిన మారుతీ రామారావుకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మూడో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమా పూజిత తీర్పు చెప్పారు. బుధవారం వెలువడిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. దోనబండకు చెందిన యలమందల కృష్ణ వద్ద 2017 ఏప్రిల్ 15న మారుతీ రామారావు రూ.75 వేలు అప్పు తీసుకున్నాడు. ఆతర్వాత ఆయన ఇచ్చిన చెక్కును కృష్ణ తన ఖాతాలో జమ చేయగా రామారావు ఖాతా రద్దు చేసుకున్నట్లుగా తెలిపారు. దీంతో ఆయన న్యాయవాది ఎం.హన్మంతరావు ద్వారా కోర్టులో కేసు దాఖలు చేయడంతో విచారణ అనంతరం రామారావుకు ఆరు నెలల శిక్ష విధించడంతో పాటు ఫిర్యాదుదారుడికి రూ.లక్ష చెల్లించాలని తీర్పు చెప్పారు.

కాలం చెల్లిన జ్యూస్ విక్రయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మయూరి సెంటర్‌లోని జీపీ రెడ్డి స్వీట్‌షాప్‌లో బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. కాలం చెల్లిన మిక్స్‌డ్ ఆపిల్ జ్యూస్ ప్యాకెట్లు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గడువు తీరిన ఆపిల్ జ్యూస్ బాటిళ్లను గుర్తించి శాంపిల్స్ సేకరించడంతో పాటు షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

మళ్లీ చుక్కెదురు..

- కొత్త మండలాల ప్రకటనలో కొమురారం, బోడుకు దక్కని చోటు
- ఇల్లెందు డివిజన్ కేంద్రం ఏర్పాటు కలేనా?
- అన్ని అనుకూలతలు ఉన్నా అడుగడుగునా నిర్లక్ష్యమే..


కొమురారం గ్రామం

ఇల్లెందు: ప్రభుత్వం మరో రెండు కొత్త మండలాలను ప్రకటించింది. ఈ కొత్త మండలాల ప్రకటనలో మళ్లీ కొమురారం, బోడులకు చుక్కెదురైంది. నూతన మండలాల ప్రకటనలో ఈ ప్రాంతాలకు మాత్రం చోటు దక్కటం లేదు. ఇల్లెందు పరిధిలో కొమురారం మండలం, టేకులపల్లి పరిధిలో బోడు మండలం ఏర్పాటు చేయాలని ఆందోళనలు చాలా కాలంగా కొనసాగుతున్నాయి. ఈ రెండు మండలాల ఏర్పాటుకు ఎన్నో అనుకూలతలు ఉన్నా అడుగడుగునా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. తెలంగాణ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఇల్లెందు కేంద్రంగా నూతన డివిజన్‌తోపాటు కొమురారం, బోడు మండలాల ఏర్పాటు ప్రక్రియ అదిగో వచ్చే.. ఇదిగో వచ్చే.. అన్న చందంగా ముగిపిస్తోంది. కానీ, కార్యరూపం మాత్రం దాల్చటం లేదు. గత జనవరిలో సీఎం కేసీఆర్ కొత్తగూడెం, ఖమ్మంలో పర్యటించి జిల్లా కలెక్టరేట్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇల్లెందును డివిజన్ కేంద్రంగా ప్రకటించి, కొమురారం, బోడు మండలాలను ఏర్పాటు ప్రకటన చేస్తారని ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో ఎదురుచూశారు. కానీ, వారి ఆశలు అడియాసలయ్యాయి.

రాష్ట్రంలో రెండు కొత్త మండలాలు

తాజాగా మరో రెండు కొత్త మండలాలను ప్రకటించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎర్రవెల్లి, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ మండలాలను ప్రకటించారు. ఈ రెండు మండలాల జాబితాలోనైనా ఇల్లెందు డివిజన్, రెండు మండలాలు ప్రకటించకపోడటం బాధాకరమని ఈ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఎన్నో రోజులుగా కొమురారం, బోడులను మండలాలుగా మార్చాలని ఎన్డీ, ప్రజాపంథా, ఇల్లెందు కేంద్రంగా సీపీఎం ఆందోళలు నిర్వహించింది. తాజాగా సీపీఐ కూడా ఇల్లెందు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలని, కొమురారం, బోడు మండలాలు ప్రకటించాలని ప్రజాపోరు యాత్ర సభలో డిమాండ్ చేసింది. కొత్త మండలాలను ప్రకటించిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను.. సింగరేణి సమస్యల మీద టీబీజీకేఎస్ నేతలను కలిశారు. కానీ, కొత్త మండలాల ప్రకటన మీద ఒత్తిడి చేయలేదని ఎన్డీ, ప్రజాపంథా, సీపీఎం పార్టీలు పేర్కొంటున్నాయి.

అన్నీ అనుకూలంగా..

కొమురారం మండలం ఏర్పాటు చేస్తే తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం మాత్రమే ఏర్పాటు చేస్తే సరిపోతుంది. ఇప్పటికే కొమురారం పరిధిలో కాచనపల్లిలో పోలీస్ స్టేషన్, కొమురారం, పోలారం, మాణిక్యారంలో మూడు యూపీఎస్, కొమురారంలో హైస్కూల్, రొంపేడులో గిరిజన బాలికల ఆశ్రమ హైస్కూల్, కొమురారంలో ఆంధ్రాబ్యాంక్, ఏపీజీవీబీ మినీబ్రాంచ్, రొంపేడులో ఎస్‌బీఐ బ్రాంచ్, కొమురారం, రొంపేడులో రెండు పీహెచ్‌సీలు, కొమురారంలో ఒక పశువైద్యశాల, కొమురారం, మాణిక్యారంలో రెండు సబ్‌స్టేషన్‌లు, కొమురారంలో ఫారెస్టు రేంజ్ కార్యాలయం, సబ్ పోస్టాఫీస్‌లు ఉన్నాయి. ఇల్లెందు నుంచి కొమురారం 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక బోడు మండలం ఏర్పాటుకు కూడా పోలీస్ స్టేషన్, హైస్కూల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం భవనాలున్నాయి. కాగా, జిల్లాలో 24వ మండలం ఏర్పాటు కోసం 2021 జనవరిలో సీఎంఓ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు కోరగా ఆగమేఘాల మీద సమాచారం సేకరించిన అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ప్రతిపాదనలు పంపి కూడా రెండేళ్లు గడిచింది. ఇదిలా ఉండగా కొమురారం కేంద్రంగా 20 వేల జనాభాతో 12 పంచాయతీలు.. ఆరు ఎంపీటీసీ స్థానాలు, 14 వేల ఓటర్లతో నూతన మండలం ఏర్పాటుకు అన్నీ అనుకూలంగా ఉన్నాయని అధికారులు సైతం అంచనా వేసినట్లు సమాచారం.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి..



కొమురారం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ రాజీనామా చేస్తే సీఎం కేసీఆర్ స్పందిస్తారు కావొచ్చు. ఎన్నికల ముందు కొత్త మండలాల ఏర్పాటైపై హామీ ఇచ్చిన ఎమ్మెల్యే.. ప్రస్తుతం ఆ హామీని నిలబెట్టుకోవాలి. అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఏన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కొమురారం కేంద్రంగా నూతన మండలం కావాలని ఆశ పడ్డారు.

–మోతీలాల్, ఎన్డీ నేత, కొమురారం

సులభరీతిలో ఇంగ్లిష్ బోధన


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఇంగ్లిష్ బోధించాలని గిరిజన గురుకులా ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి జిల్లాలోని గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటుచేశారు. ఈ శిక్షణలో ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈమేరకు ఉపాధ్యాయులు సులభమైన రీతిలో బోధించేలా సిద్ధమై విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నవోదయ పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి.కృష్ణారావుతో పాటు ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు టి.లక్ష్మీరాజ్యం, ఎంఎస్.రాంబాబు, భాస్కరాచారి, హరికృష్ణ, శకుంతల, సంధ్య, స్వర్ణలత, భద్రయ్య, వీరస్వామి, నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, సంధ్యారాణి పాల్గొన్నారు.

ముమ్మరంగా తునికాకు సేకరణ


ఆకులను కట్టలుగా కడుతున్న గిరిజనులు

గుండాల: వేసవిలో గిరిజనుల రెండో పంట అయిన తునికాకు సేకరణ మండలంలో ముమ్మరంగా సాగుతోంది. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో చుట్టుపక్కల గ్రామాల్లో ఇంటిల్లిపాది తెల్లవారుజామున్నే అడవులకు వెళ్లి ఆకు సేకరిస్తున్నారు. గత ఏడాది 50 ఆకుల కట్టకు రూ. 2.07 పైసలు ఉండగా, ఈ ఏడాది రూ.3.01 పైసలు ఖరారు చేశారు. దీంతో గిరిజనులంతా ఉపాధి పనులకు బ్రేక్ ఇచ్చి ఆకు సేకరణకు వెళ్తున్నారు. ముందుగా వారి చెలకల్లో ఆకు కోసి అనంతరం అడవులు, గుట్టలపై ఆకు కోస్తారు. ఈ సీజన్‌లో ఒక్కో కుటుంబం రూ.10 వేలకు పైగా ఆదాయం సమకూర్చుకుంటుంది. పిల్లలు సైతం కల్లంలో ఉన్న కట్టలకు లూజింగ్, ఉల్టా, పల్టా చేస్తుంటారు. ఆకు సేకరణ పది, పదిహేను రోజుల పాటు సాగుతుంది.

పోలీసుస్టేషన్‌లో ప్రేమజంట కుటుంబీకుల ఘర్షణ

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి తల్లి

ఖమ్మంఅర్బన్: నాలుగేళ్లు ప్రేమించుకున్న యువతీ, యువకులు పెద్దలకు చెప్పకుండా పెళ్లి చేసుకున్నారు.. ఆపై రక్షణ కల్పించాలని పోలీసుస్టేషన్‌కు రాగా.. అదే సమయానికి ఇద్దరి కుటుంబీకులు కూడా చేరుకున్నారు. దీంతో ఘర్షణ జరగగా యువతి తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పెద్ద లచ్చితండాకు చెందిన బన్సీలాల్, అదే తండాకు చెందిన ఆయన సమీప బంధువు సిరి చందన నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఖమ్మంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో చదువుతున్న వీరిద్దరు ఈనెల 17న హైదరాబాద్‌లో వివాహం చేసుకున్నారు. యువతి అదృశ్యమైందని ఆమె తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా, పెళ్లి చేసుకున్న యువతీయువకులు బుధవారం పోలీసుస్టేషన్‌కు రాగా, అదే సమయానికి ఇరువురి కుటుంబసభ్యులు సైతం వచ్చారు. ఈక్రమంలో అమ్మాయి తల్లి కుమార్తెను తనతో రావాలని సూచించగా ఆమె భర్తతోనే వెళ్తానని చెప్పింది. దీంతో రెండు కుటుంబాల వారు స్టేషన్ ఆవరణలోనే ఘర్షణ పడ్డారు. చివరకు పోలీసులు కలగచేసుకుని యువతీ, యువకులిద్దరూ మేజర్లే అయినందున వారి ఇష్ట ప్రకారం నడుచుకోవాలని బయటకు పంపించగా.. అమ్మాయి తల్లి పురుగులమందు తాగింది. దీంతో ఆమెను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి మాట్లాడుతూ ప్రేమ జంటకు కౌన్సెలింగ్ చేయగా, కలిసే ఉంటామని చెప్పడంతో పంపించామని తెలిపారు. ఆతర్వాత స్టేషన్ బయట ఘర్షణ పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనతో తమకు సంబంధం లేదని చెప్పారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: పాత్రికేయులను దూషిస్తూ వాట్సాప్‌లో పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిపై బుధవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం .. అశ్వారావుపేటకు చెందిన ఎస్‌కే అన్వర్ పాత్రికేయుల ఇంటి స్థలాల విషయంపై అసభ్యకరంగా, పాత్రికేయులను దూషిస్తూ పలు వాట్సాప్ గ్రూప్‌లలో పోస్టులు షేర్ చేశాడు. దీనిపై స్థానిక పాత ఎంపీడీఓ ఆఫీసు ఆవరణలో విలేకరి కొల్లు రమేశ్.. అన్వర్‌ను ప్రశ్నించగా.. తనను దుర్భాషలాడటంతోపాటు చంపేస్తానని బెదిరించినట్లు బాధితుడు లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అన్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

భూగర్భజలాలపై విద్యార్థులకు అవగాహన


చెక్ డ్యాంను పరిశీలిస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: భూగర్భ జలాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని మల్లాయిగూడెం, గాండ్లగూడెం, అనంతారం, రామన్నగూడెం గ్రామాల్లోని వాటర్‌షెడ్ పథకాలను అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించి, ఆయా గ్రామాల్లోని చెక్‌డ్యాంలు, రాతికట్టలు, నీటి కుంటలతోపాటు రామన్నగూడెం గ్రామంలోని మిల్లెట్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ నాగాంజలి ఆధ్వర్యంలో భూగర్భజలాలు పెంచే విధానం, పద్ధతులు, భూగర్భ జలాలతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అలాగే జీవామృతం, గోమూత్రం గురించి, సేంద్రియ పద్ధతిలో కూరగాయల పంటల సాగు, చిరు ధాన్యాలతో బిస్కెట్‌లు తయారు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధితులు, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు డి.ప్రసాద్, ముత్యాలు, భీమరాజు, సీతారాములు, ఎం.రాములమ్మ, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో విచారణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై పలువురు ఫిర్యాదు చేయడంతో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ వ్యక్తిగత పనులకే ఎక్కువ సమయం కేటాయిస్తూ రోగులను పట్టించుకోవడంలేదని, పైగా రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నాడని ఫిర్యాదులు అందటంతో డీఎంహెచ్‌ఓ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్‌కుమార్ విచారణ నిర్వహించారు. రోగులతో పాటు సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారలకు నివేదిస్తామని వారు తెలిపారు.

పంచాయతీ ట్రాక్టర్ బోల్తా


పల్టీ కొట్టిన ట్రాక్టర్

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బుధవారం అదుపుతప్పి బోల్తా కొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నీళ్ల ట్యాంకర్‌తో రోడ్డు పక్కన ఉన్న మొక్కలకు నీళ్లు పడుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ట్రాక్టర్ ఇంజన్ ఒకవైపు, ట్యాంకర్ మరోవైపు పల్టీ కొట్టాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ భూక్యా రవికి గాయాలు కావడంతో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం


అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన ఇల్లు


మృతిచెందిన లేగదూడ

దమ్మపేట: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని రంగువారిగూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రంగువారిగూడెం గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రంలో బాల శ్రీనివాసరావు, బొట్ల చెన్నారావుకు చెందిన రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరి ఇళ్లు పైకప్పు రేకులతో నిర్మించగా, ఒకరి ఇంటికి గోడలకు బదులుగా చుట్టూ గుడ్డను కట్టి ఉంచగా.. మరొకరి ఇంటి చుట్టూ రేకులను రక్షణగా ఉంచారు. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో రెండు ఇళ్లకు మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బాధితులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. ప్రమాదంలో ఒక లేగదూడ చనిపోగా, ఇళ్లల్లో ఉన్న అన్ని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి యజమానులు తమకు కేవలం ఒంటి మీద ఉన్న బట్టలే మిగిలాయని కన్నీటిపర్యంతమయ్యారు. సుమారుగా రూ.రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

వృద్ధుడిపై పోక్సో కేసు

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామంలో ఐదేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన వృద్ధుడిపై స్థానిక పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ పోటు గణేశ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలానికి చెందిన దంపతులు తమ ఐదేళ్ల కుమార్తెతో బతుకు దెరువు కోసం జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం కాకర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకోవడానికి బాలికపై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు సిరికొండ మోహన్ లైంగికదాడికి యత్నించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మోహన్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు.

‘దళితబంధు’ మొబైల్ క్యాంటీన్ సీజ్


మొబైల్ క్యాంటీన్‌ను సీజ్ చేస్తున్న ఉద్యోగులు

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి సునీతకు దళితబంధు పథకం ద్వారా మంజూరైన మొబైల్ క్యాంటీన్‌ను గ్రామపంచాయతీ కార్యదర్శి చెవుల మహేష్ బుధవారం సీజ్ చేశారు. క్యాంటీన్‌ను ఆమె గత మూడు నెలల నుంచి నడిపించడం లేదు. లబ్ధిదారుల ఆర్థికాభివృద్ధి కోసం మంజూరు చేసిన యూనిట్లను సక్రమంగా నడిపించాల్సి ఉన్నా అలా జరగకపోవడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేయగా యూనిట్‌ను సీజ్ చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామ సమీపంలో ఈ నెల 18న ఆర్టీసీ బస్సు, డీసీఎం వాహనం ఢీకొన్న విషయం విదితమే. ఈ ప్రమాదంలో బస్సులో పది మందికి గాయాలయ్యాయి. మణుగూరు ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై బుధవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేశ్ తెలిపారు.

సరిహద్దులో చెక్‌పోస్ట్


చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వైరారూరల్: ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన వైరా మండలం గన్నవరం –దాచాపురం శివారులో అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యాన్ని తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా అడ్డుకునేందుకు ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖల సంయుక్త పర్యవేక్షణలో ఈ చెక్‌పోస్ట్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా వైరా ఏసీపీ ఎం.ఎ.రెహమాన్ ఆధ్వర్యాన సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ తదితరులు వాహనాల తనిఖీ చేపట్టారు.

ఫుట్‌వేర్ షాపులో షార్ట్‌సర్క్యూట్

కొత్తగూడెంఅర్బన్: ఎంజీ రోడ్డులోని ఓ ఫుట్‌వేర్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా స్వల్పంగా మంటలు లేచాయి. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కొత్తగూడెం ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ శ్రీనివాస్, షాపు యజమానుల కథనం ప్రకారం.. ఎంజీ రోడ్డులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫ్రెండ్స్ ఫుట్‌వేర్ షాపు నేమ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా స్వల్పంగా మంటలు వచ్చాయి. పొగ కూడా రావడంతో షాపు యజమానులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే షాపు వద్దకు ఫైర్ ఇంజన్ చేరుకోగా సిబ్బంది మంటలను ఆర్పారు. షాపునకు సంబంధించి నేమ్ బోర్డు మాత్రమే కాలిపోగా, మిగతా సామగ్రికి ఎలాంటి నష్టం జరగలేదు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం లాకుల వద్ద సాగర్ కాల్వలో గల్లంతైన ఖమ్మం నగరానికి చెందిన ఎం.మణికుమార్(32) మృతదేహం బుధవారం ఖమ్మం అర్బన్ మండలం వి.వెంకటాయపాలెం లాకుల వద్ద లభ్యమైంది. పెయింటింగ్ పనిచేసే మణికుమార్ స్నేహితుడితో కలిసి కాల్వలో ఈత కొడుతుండగా నీటి ఉధృతితో మంగళవారం గల్లంతయ్యాడు. రాత్రి పొద్దుపోయే వరకు వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం ఉదయం గాలించగా వి.వెంకటాయపాలెం వద్ద మృతదేహం లభించింది. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడి తల్లి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రూ.1.49కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మంలోని రిక్కాబజార్‌కు చెందిన షేర్ బ్రోకర్ మహ్మద్ అబ్దుల్ మూయిద్ పది మందిని ప్రతివాదులుగా చేరుస్తూ రూ.1,49,20,000కు దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. ఆయన మూడేళ్ల క్రితం నగరంలో వ్యాపారాన్ని ప్రారంభించి షేర్లు కొనడం, అమ్మడం చేసేవాడు. ఈక్రమంలో షేర్ల విలువ పడిపోవడంతో పెట్టుబడి పెట్టిన వారి నుంచి ఒత్తిడి వస్తోందని చెబుతూ స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాది ద్వారా బుధవారం దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.